సాక్షి ఎక్స్‌ప్రెస్

తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుచున్న తెలుగు సాక్షి దిన పత్రికకు జిల్లాల వారిగా మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.

కొత్త వారికి అవకాశం, అనుభవం గల వారికి ప్రాధాన్యత

సాక్షి ఎక్స్‌ప్రెస్

Ph: 9491124918, 9440699106

సంపుటి : 1 | సంచిక : 1 | - | శనివారం 7 నవంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

రేషన్ కార్డుదారులకు రూ.5 లక్షల బీమా!

- నవంబర్ 19న ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభం
- కుటుంబ పెద్ద మరణిస్తే కుటుంబానికి ఆర్థిక భరోసా..
- ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లింపు
- నవంబర్ 20 నుంచి 30 వరకు ఇంటింటి సర్వే..
- ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక



హైదరాబాద్

తెలంగాణలో రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పథకానికి శ్రీకారం చుట్టనుంది. కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రూ.5 లక్షల జీవిత బీమా అందించే 'ఇందిరమ్మ బీమా' పథకాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేటలో నిర్వహించే బహిరంగ సభలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని అర్హులైన రేషన్ కార్డుదారుల కుటుంబాలకు ఈ పథకం ద్వారా - మిగతా3లో



విక్రమ్ రెడ్డి వంద మందితో వచ్చి బూత్ క్యాప్చరింగ్‌కు యత్నించారు


స్థానిక ఎన్నికల తీరుపై వైసీపీకి మంత్రి ఆనం చురకలు

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహిస్తున్నామన్న ఆనం

తన సహనాన్ని చేతకానితనంగా చూడొద్దని విక్రమ్ రెడ్డికి హెచ్చరిక

కొడంగల్ అభివృద్ధికి మెగా ప్లాన్

- సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల కొడంగల్ పర్యటన ఖరారు
- సుమారు రూ.9100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- రైతు మేళా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి
- వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు
- పర్యటన ముగింపులో భారీ రైతు బహిరంగ సభ ఏర్పాటు



హైదరాబాద్

తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గ రూపురేఖలను మార్చే లక్ష్యంతో సుమారు రూ.9,100 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నవంబర్ 7, 8, 9 తేదీల్లో ఆయన కొడంగల్‌లో కీలక పర్యటన చేపట్టనున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారీ ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల - మిగతా3లో



దీపావళి కానుకలతోనూ కాలుష్యం పెరుగుతోంది

- ఢిల్లీ వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు!
- దీపావళి కానుకల సంస్కృతిపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- కానుకల పంపిణీతో వాహన కాలుష్యం పెరుగుతోందని అభిప్రాయం
- సంపన్నులు కానుకలను హోదా చిహ్నంగా మార్చారని సీజేఐ వ్యాఖ్య
- ఢిల్లీలో సగటు ఏక్యూఐ 389గా నమోదు
- పలు ప్రాంతాల్లో 400 దాటిన కాలుష్య సూచీ

ముంబైలో మళ్ళీ బాంబు బెదిరింపులు..

- అమితాబ్ బంగ్లా సహా పలు ప్రాంతాలు టార్గెట్!
- అమితాబ్ బచ్చన్ బంగ్లా, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను పేల్చేస్తామని హెచ్చరిక
- బాంబే హైకోర్టుకు నేరుగా వచ్చిన బెదిరింపు ఈ-మెయిల్
- అప్రమత్తమైన పోలీసులు, కీలక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం





బాపట్ల జిల్లాలో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే..

రైతులతో ముఖాముఖి

తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు బాపట్ల చేరుకున్న సీఎం

ఏరియల్ సర్వే ద్వారా మరోసారి నష్టాన్ని అంచనా వేసిన చంద్రబాబు

జిల్లెలమూడి వద్ద డ్రెయిన్ల నష్టంపై అధికారులతో సమీక్ష

రేటూరులో రైతులతో మాట్లాడి, మునిగిన పంటలను పరిశీలించనున్న సీఎం

అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన శుక్రవారం బాపట్ల జిల్లాకు చేరుకున్నారు. అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన ఆయన, మార్గమధ్యంలో ఏరియల్ సర్వే ద్వారా తుపాను కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను మరోసారి పరిశీలించారు. అనంతరం సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ల్యాండ్ అయ్యారు. ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి ముఖ్యమంత్రి రోడ్డు మార్గంలో బాపట్ల మండలం జిల్లెలమూడి వంతెన వద్దకు బయలుదేరారు. అక్కడ తుపాను ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న డ్రెయిన్లను పరిశీలించి, వాటి పునరుద్ధరణ పనులపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి పత్తిపాడు నియోజకవర్గంలోని రేటూరు గ్రామానికి వెళతారు. ఆ గ్రామంలో తుపాను కారణంగా నీట మునిగిన వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. పంట నష్టపోయిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి భరోసా ఇవ్వనున్నారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి, సహాయక చర్యలను వేగవంతం చేయడంపై ఈ పర్యటనలో సీఎం దృష్టి సారించారు.



ఏపీలో పెండింగ్ మున్సిపల్ ఎన్నికలకు

ముహూర్తం ఖరారు!

ఈ నెల 10--12 మధ్య నోటిఫికేషన్.. 25లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి

23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలకు ఈసీ కసరత్తు

రిజర్వేషన్లు ఖరారు.. ఓటర్ల జాబితాలు, వార్డుల పునర్విభజన పూర్తి

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. వివిధ కారణాలతో వాయిదా పడిన 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నెల 10 నుంచి 12 తేదీల మధ్య ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఈ నెల 25వ తేదీలోపు మొత్తం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే మేయర్, ఛైర్‌పర్సన్, డివిజన్లు, వార్డు స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలో గతంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి అక్టోబర్ 14న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే కొన్ని పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన కేసులు హైకోర్టులో - మిగతా3లో

సాక్షి ఎక్స్‌ప్రెస్

శనివారం 7
నవంబర్ 2026

రాహుల్ గాంధీ టీ మీటింగ్‌కు సిద్ధరామయ్య గైర్హాజరు!



కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఏర్పాటు చేసిన కీలక సమావేశానికి దూరంగా ఉన్నారు. ఈరోజు రాహుల్ గాంధీ టీ మీటింగ్‌కు తాను హాజరుకాలేనని, ముందుగా నిర్ణయించుకున్న పర్యటన ఉందని ఆయన పార్టీకి తెలియజేశారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్ ఈ సమావేశానికి హాజరవుతారని తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం సిద్ధరామయ్య ఈరోజు హాసన్ జిల్లా పర్యటనకు వెళ్లారు. అక్కడ చారిత్రక హసనాంబ ఆలయంలో జరుగుతున్న వార్షిక జాతర మహోత్సవంలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకోనున్నారు. హొయసల కాలం నాటి ఈ ఆలయం అక్టోబర్ 29న భక్తుల కోసం తెరుచుకోగా, నవంబర్ 11న ఉత్సవాలు ముగియనున్నాయి. ఇదిలా ఉండగా, ఇటీవల తనపై వచ్చిన నకిలీ స్టింగ్ ఆపరేషన్ వీడియో వ్యవహారంపై చర్చించేందుకు సిద్ధరామయ్య ఈనెల 3న ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ఈ భేటీ తర్వాతే ఆయన రాహుల్ సమావేశానికి గైర్హాజరు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మరోవైపు, సిద్ధరామయ్యను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన స్టింగ్ వీడియోపై బెంగళూరు పోలీసులు కీలక ప్రకటన చేశారు. ఈ వీడియోలో ఉన్న లైంగిక వేధింపుల ఆరోపణలు 'కల్పితం, ఉద్దేశపూర్వకంగా సృష్టించిన కథనం' అని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని తెలిపారు. వీడియోలో కనిపించిన వ్యక్తులందరినీ విచారించామని, వారి వాంగ్మూలాలు, సేకరించిన ఆధారాల ప్రకారం ఆ ఆరోపణలు కట్టుకథ అని తేలినట్లు పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వీడియో సృష్టి, రికార్డింగ్, సర్క్యులేషన్‌పై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని వారు స్పష్టం చేశారు.

విక్రమ్ రెడ్డి వంద మందితో వచ్చి బూత్ క్యాప్చరింగ్‌కు యత్నించారు



స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తుంటే, వైసీపీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. నెల్లూరులో ఆయన మాట్లాడుతూ... ఓసీకి కేటాయించిన మేయర్ స్థానాన్ని బీసీలకు కేటాయించడమే టీడీపీ నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో నామినేషన్ల సమయంలోనే అభ్యర్థులను బెదిరింపులకు గురి చేశారని... ఇప్పుడు సక్రమంగా ఎన్నికలు జరుగుతుంటే ఆటంకాలు కలిగిస్తున్నారని విమర్శించారు. ఆత్మకూరులో 10 వార్డులు వైసీపీ గెలుచుకున్నా తాము అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. అనంతసాగరం పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి వందమంది అనుచరులతో వచ్చి బూత్ క్యాప్చరింగ్‌కు ప్రయత్నించారని, దొంగ ఓట్లు వేయించారని సంచలన ఆరోపణలు చేశారు. దొంగ ఓట్లు వేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డిని ఉద్దేశించి ఆనం ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ అనుభవాన్ని తక్కువ అంచనా వేయొద్దని, సుప్రీంకోర్టుకు లాగుతానానే బెదిరింపులకు తాను భయపడనని స్పష్టం చేశారు. ప్రస్తుతం సంయమనంతో వ్యవహరిస్తున్నానని, తన సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని ఆయన గట్టిగా హెచ్చరించారు.

ముంబైలో మళ్ళీ బాంబు బెదిరింపులు..



ముంబై మహానగరంలో మరోసారి బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ నివాసం 'జల్సా' సహా నగరంలోని పలు కీలక ప్రాంతాలను పేల్చివేస్తామంటూ ఆగంతుకులు ఈ-మెయిల్ ద్వారా హెచ్చరించారు. ఈ మెయిల్ నేరుగా బాంబే హైకోర్టుకు రావడంతో భద్రతా ఏజెన్సీలు తక్షణమే అప్రమత్తమయ్యాయి. న్యూస్ ఏజెన్సీ ఐఏఎన్ఎస్ కథనం ప్రకారం... బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (దీంజు), వర్లీ రేస్‌కోర్స్, అమితాబ్ బచ్చన్ బంగ్లాను పేల్చివేస్తామని ఈ-మెయిల్‌లో పేర్కొన్నారు. "ఈ బెదిరింపును తీవ్రంగా పరిగణిస్తున్నాం. ముంబై పోలీసులు, ఇతర భద్రతా ఏజెన్సీలు దీనిపై దర్యాప్తు చేస్తున్నాయి. ఈ-మెయిల్ పంపిన వారిని గుర్తించే పనిలో ఉన్నాం" అని ముంబై పోలీసులు తెలిపినట్లు ఐఏఎన్ఎస్ వెల్లడించింది. బెదిరింపు నేపథ్యంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, స్థానిక పోలీసులు ఆయా ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో ముంబైలో ఇలాంటి బెదిరింపులు ఎక్కువయ్యాయి. అక్టోబర్ 23న అమితాబ్ బచ్చన్ ఆస్తిని లక్ష్యంగా చేసుకుని ఓ స్కూల్‌కు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. అంతకుముందు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (దీవీజు) ప్రధాన కార్యాలయానికి కూడా ఇలాంటి హెచ్చరికే అందింది. అయితే, తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. తాజా ఘటనతో సైబర్ సెల్ పోలీసులు రంగంలోకి దిగారు. ఈ-మెయిల్ పంపిన వారి ఐపీ అడ్రస్, డిజిటల్ ఆధారాలను ట్రేస్ చేసి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వరుస ఘటనల వెనుక ఒకే ముఠా ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

దీపావళి కానుకలతోనూ కాలుష్యం పెరుగుతోంది




దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతున్న వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దీపావళి సందర్భంగా కానుకలు ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం కూడా వాహన కాలుష్యానికి కారణమవుతోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ఏటా కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్న ఢిల్లీలో పరిస్థితులు మారాలంటే ప్రజల ఆలోచనా విధానం, జీవనశైలిలో మార్పు రావాలని సూచించారు. ముఖ్యంగా సంపన్నులు దీపావళి కానుకల సంప్రదాయాన్ని సామాజిక హోదా, ప్రతిష్ఠకు చిహ్నంగా మార్చేశారని వ్యాఖ్యానించారు. ఢిల్లీ కాలుష్యంపై శుక్రవారం విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. కానుకలు ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి వల్ల వాహనాల రాకపోకలు పెరిగి కాలుష్యం ఎక్కువవుతోందని పేర్కొన్నారు. మన అసలైన సంప్రదాయం ఏమిటో, ఏ పద్ధతులు పాటించాలో ప్రజలు గుర్తించాలని అన్నారు. దీపావళి కానుకల పంపిణీని తగ్గించడం కూడా కాలుష్య నియంత్రణకు అవసరమైన సాంస్కృతిక మార్పుల్లో భాగమని అభిప్రాయపడ్డారు. మరోవైపు ఢిల్లీలో గాలి నాణ్యత మరింత దిగజారింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గణాంకాల ప్రకారం శుక్రవారం నగర సగటు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 389గా నమోదైంది. పలు ప్రాంతాల్లో ఇది 400 దాటింది. దీంతో గాలి నాణ్యత తీవ్ర కేటగిరీకి చేరువైంది. దీపావళి నవంబర్ 8న జరగనున్న నేపథ్యంలో మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి. పండుగ కానుకల కొనుగోళ్లు, పంపిణీతో వాహనాల రద్దీ పెరుగుతోందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలోకి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వాహనాలు వస్తుండటంతో వాటి కాలుష్య ఉద్గారాలను పర్యవేక్షించడం కష్టమవుతోందని సీజేఐ పేర్కొన్నారు. ఒక వాహనం కేవలం రెండు గంటల పాటు నగరంలో తిరిగినా కాలుష్యానికి కారణమవుతుందని అన్నారు. వాహనాల సంఖ్య మాత్రమే కాకుండా అవి రోడ్లపై ఎంతసేపు తిరుగుతున్నాయన్నది కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు కోర్టుకు తెలిపారు. ఇప్పటికే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) రెండో దశ అమల్లో ఉందని, రోడ్లపై నీళ్లు చల్లడం, సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేయడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాల (పీయూసీ) పరీక్షలు ఎక్కడ నిర్వహిస్తున్నారో గుర్తించేలా జియోట్యాగింగ్ చేస్తున్నామని చెప్పారు.

రేషన్ కార్డుదారులకు రూ.5 లక్షల బీమా!

-మొదటిపేజీ తరువాయి

బీమా రక్షణ కల్పించనున్నారు. ఇందిరమ్మ బీమా పథకం కింద ప్రతి అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కవరేజీ కల్పించనున్నారు. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబ సభ్యులకు బీమా పరిహారం అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. మరణానికి కారణంతో సంబంధం లేకుండా బీమా సొమ్ము అందించేలా పథకాన్ని రూపొందించినట్లు సమాచారం. దీనివల్ల కుటుంబ పెద్దను కోల్పోయిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరట లభించనుంది.



ప్రీమియం చెల్లించేది ప్రభుత్వమే

సాధారణంగా జీవిత బీమా పొందాలంటే పాలసీదారులు నిర్ణీత మొత్తంలో ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇందిరమ్మ బీమా పథకంలో లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఉండదు. బీమా కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ఇందుకోసం ఇప్పటికే బీమా సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. దీంతో అర్హులైన కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా జీవిత బీమా రక్షణ అందనుంది.

నవంబర్ 20 నుంచి ఇంటింటి సర్వే

పథకం ప్రారంభం అనంతరం లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నారు. నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సమాచారం. ఎమ్మార్వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఈ ప్రక్రియలో భాగస్వాములై అర్హులైన కుటుంబాలను గుర్తించనున్నారు. రేషన్ కార్డుల ఆధారంగా వివరాలను పరిశీలించి పథకంలో లబ్ధిదారులుగా చేర్చే చర్యలు చేపట్టనున్నారు.

19 నుంచి ఇందిరమ్మ చీరల పంపిణీ

మరోవైపు మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసేందుకు కూడా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాలకు చీరలను పంపించినట్లు సమాచారం. వివిధ రంగులు, డిజైన్లలో చీరలను తయారు చేయించారు. సాధారణంగా బతుకమ్మ పండుగ సందర్భంగా పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ తయారీ ప్రక్రియలో జాప్యం కారణంగా ఈసారి నవంబర్‌లో పంపిణీ చేపట్టనున్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

కుటుంబంలో సంపాదించే వ్యక్తి అకస్మాత్తుగా మరణిస్తే ఆ కుటుంబం అనేక ఆర్థిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పిల్లల చదువులు, కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు భారంగా మారుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో రూ.5 లక్షల బీమా పరిహారం అందించడం ద్వారా బాధిత కుటుంబాలకు కొంత ఆర్థిక భద్రత కల్పించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఇందిరమ్మ బీమా పథకం అమలు ద్వారా రాష్ట్రంలోని అర్హులైన పేద కుటుంబాలకు జీవిత బీమా రక్షణ అందనుంది.

కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్..

-మొదటిపేజీ తరువాయి

కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. ఈ పర్యటనలో భాగంగా రెండు రాత్రులు ఆయన కొడంగల్‌లోనే బస చేయనున్నారు. మూడు రోజుల పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి.

నవంబర్ 7 (శనివారం):

ఉదయం 11 గంటలకు హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమై, పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు. రాత్రికి కొడంగల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు.

నవంబర్ 8 (ఆదివారం):

హకీంపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. హకీంపేటలో నూతనంగా నిర్మించిన పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రానజ) భవనాలను ప్రారంభిస్తారు. బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల మండలాల్లో పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారు. నాచారం వద్ద రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2 పనులకు శంకుస్థాపన చేస్తారు. కోస్గిలో సైన్స్ మ్యూజియం, దౌలతాబాద్‌లో జూనియర్ కళాశాల, బాలంపేటలో పీహెచ్‌సీని ప్రారంభిస్తారు. రాత్రి కొడంగల్‌లోనే బస చేస్తారు.

నవంబర్ 9 (సోమవారం):

ఈ మూడు రోజుల పర్యటనలో మొత్తం రూ.9,053.48 కోట్ల విలువైన 13 కీలక అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు. పర్యటన ముగింపులో భాగంగా హకీంపేటలో ఏర్పాటు చేసే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ పర్యటన ద్వారా కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

ఏపీలో పెండింగ్ మున్సిపల్ ఎన్నికలకు ముహూర్తం ఖరారు!



-మొదటిపేజీ తరువాయి

పెండింగ్‌లో ఉండటంతో వాటిని అప్పటి ఎన్నికల షెడ్యూల్‌లో చేర్చలేదు. తాజాగా ఆయా కేసుల పరిష్కారం కావడంతో మిగిలిన పట్టణ స్థానిక సంస్థల్లోనూ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

పెండింగ్ పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాథమిక ప్రక్రియను పురపాలక శాఖ అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. డివిజన్లు, వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల వివరాల గుర్తింపు ప్రక్రియను చేపట్టారు. తాజాగా మేయర్, చైర్‌పర్సన్, వార్డు సభ్యులు, డివిజన్ స్థానాలకు రిజర్వేషన్లను కూడా ఖరారు చేశారు. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఎన్నికలు జరగనున్న 23 పట్టణ స్థానిక సంస్థలు ఇవే..

పెండింగ్‌లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థల్లో శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, కాకినాడ, మంగళగిరి-తాడేపల్లి, ఆముదాలవలస, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, గుడివాడ, గూడూరు, కందుకూరు, కావలి, నరసరావుపేట, పొన్నూరు, రాజాం, శ్రీకాళహస్తి, తాడిగడప, బాపట్ల, అల్లూరు, చింతలపూడి, పొదిలి, బి.కొత్తపేట ఉన్నాయి.

25లోపు ప్రక్రియ పూర్తి చేయాలన్న లక్ష్యం

నోటిఫికేషన్ విడుదలైన వెంటనే నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు వంటి దశలను వేగంగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఈ నెల 25వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని ముగించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎన్నికలు జరగాల్సిన పట్టణాల్లో రాజకీయ పార్టీల్లో మరోసారి సందడి నెలకొననుంది. అభ్యర్థుల ఎంపిక, స్థానిక రాజకీయ సమీకరణాలు, ప్రచార వ్యూహాలపై ప్రధాన పార్టీలు దృష్టి సారించనున్నాయి.

సాక్షి ఎక్స్‌ప్రెస్
శనివారం 7
నవంబర్ 2026

బిజినెస్

అతడు లోన్ ఎగ్గొడితే.. మీరు కట్టాల్సిందేనా?

గ్యారంటీ సంతకం చేసే ముందు ఈ విషయాలు తెలుసుకోండి!



స్నేహితుడో, బంధువో బ్యాంకు లోన్ తీసుకోవాలనుకున్నప్పుడు అర్హతలు సరిపోక మీ సాయం కోరవచ్చు. గ్యారంటీగా సంతకం చేయాలని అడగవచ్చు. వారి మీద నమ్మకంతో చాలామంది వెంటనే అంగీకరిస్తుంటారు. కానీ ఈ నిర్ణయం తీసుకునే ముందు ఒకసారి ఆలోచించాలి. ఎందుకంటే రుణానికి హామీదారుగా సంతకం చేయడం అంటే కేవలం స్నేహితుడికి సాయం చేయడం మాత్రమే కాదు.. అతడు లోన్ వాయిదాలు చెల్లించకపోతే ఆ బాధ్యతను మీరూ స్వీకరించడమే. భారత్‌లో రుణ హామీ ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత, రుణగ్రహీత చెల్లించాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు బ్యాంకు మిమ్మల్ని కూడా బాధ్యులుగా చేయవచ్చు.

మీ సేవింగ్స్‌కూ ముప్పు

రుణగ్రహీత వాయిదాలు చెల్లించడంలో విఫలమైతే, ఒప్పంద నిబంధనల ప్రకారం బ్యాంకు బకాయి మొత్తాన్ని మీ నుంచి వసూలు చేసేందుకు ప్రయత్నించవచ్చు. ఈ పరిణామం మీ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అత్యవసర అవసరాల కోసం దాచుకున్న డబ్బు, భవిష్యత్తు ఖర్చుల కోసం కూడబెట్టిన సొమ్ము కూడా లోన్ చెల్లింపులకు వినియోగించాల్సి రావచ్చు. బకాయిలు అలాగే ఉంటే బ్యాంకు చట్టపరమైన చర్యలకూ దిగవచ్చు. కొన్ని పరిస్థితుల్లో మీ ఆస్తులకూ ముప్పు ఏర్పడవచ్చు.

మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతినొచ్చు

మీరు తీసుకోని లోన్ కారణంగా మీ క్రెడిట్ హిస్టరీపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. ప్రధాన రుణగ్రహీత వాయిదాలు సకాలంలో చెల్లించకపోయినా, లోన్ ఎగవేసినా ఆ వివరాలు క్రెడిట్ సమాచార సంస్థలకు చేరే అవకాశం ఉంది. దీంతో మీ క్రెడిట్ స్కోర్ తగ్గవచ్చు. భవిష్యత్తులో వ్యక్తిగత రుణం, గృహ రుణం, క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసినప్పుడు బ్యాంకులు మీ క్రెడిట్ హిస్టరీని పరిశీలిస్తాయి. అప్పుడు మీరు ఇప్పటివరకు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించినా, హామీ ఇచ్చిన లోన్ ప్రతికూలతలు మీపై ప్రభావం చూపవచ్చు.

భవిష్యత్తులో మీకు రుణం రావడం కష్టమవుతుందా?

మరొకరి లోన్‌కు హామీగా నిలవడం మీ భవిష్యత్తు రుణ అర్హతపైనా ప్రభావం చూపవచ్చు. ఆ హామీని బ్యాంకులు మీపై ఉన్న ఆర్థిక బాధ్యతగా పరిగణించే అవకాశం ఉంది. మీరు సొంతంగా ఇల్లు కొనాలనుకున్నా, కారు తీసుకోవాలనుకున్నా లేదా వ్యక్తిగత అవసరాల కోసం రుణం కోరినా ఈ అంశాన్ని పరిశీలించవచ్చు. హామీగా ఉన్న మొత్తం ఎక్కువైతే, మీకు మంజూరయ్యే రుణ పరిమితి తగ్గే అవకాశముంది.

హామీ ఇచ్చే ముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరి

రుణానికి గ్యారంటీగా సంతకం చేసే ముందు ఒప్పందాన్ని పూర్తిగా చదవాలి. రుణగ్రహీత చెల్లించకపోతే మీపై పడే బాధ్యత ఎంత? వడ్డీ, ఆలస్య రుసుములు, జరిమానాలు సహా ఎంత మొత్తం చెల్లించాల్సి రావచ్చు? ఏ పరిస్థితుల్లో బ్యాంకు మీ నుంచి డబ్బు వసూలు చేయవచ్చు? వంటి అంశాలను స్పష్టంగా తెలుసుకోవాలి. రుణం తీసుకుంటున్న వ్యక్తి ఆదాయం ఎంత? ఇప్పటికే ఇతర రుణాలు ఉన్నాయా? గతంలో వాయిదాలను సక్రమంగా చెల్లించారా? అన్న విషయాలనూ పరిశీలించాలి. స్నేహితులు, బంధువులకు ఆర్థికంగా అండగా నిలవడం మంచి విషయమే. అయితే ఆ సాయం మీకు భారంగా మారకూడదు. రుణగ్రహీత చెల్లించకపోతే మొత్తం బకాయిని మీరే చెల్లించగలరా? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకోండి. ఆ బాధ్యతను భరించే పరిస్థితి లేకపోతే గ్యారంటీగా సంతకం చేయకపోవడమే మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

కుప్పకూలిన స్టాక్‌మార్కెట్లు..
ట్రిలియన్ డాలర్లు కోల్పోయిన టెకీ కంపెనీలు

న్యూయార్క్: అమెరికాలో మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు జయకేతనం ఎగురవేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆ దేశ స్టాక్‌మార్కెట్ల లో ట్రిలియన్ల డాలర్లు ఆవిరైపోతున్నాయి. అమెరికా, యూరోప్, ఆసియా దేశాల్లోని టెకీ సంస్థలపై మిడ్‌టర్మ్ ఫలితాలు దారుణమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్మెంట్ మందగిస్తుందన్న భయాందోళనల వల్ల అమెరికా స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికాలో నాస్‌డాక్ షేర్లు 5.5 శాతం పడిపోయాయి. దీంతో సుమారు 2.5 ట్రిలియన్ల డాలర్ల మార్కెట్ నష్టపోయినట్లు తెలుస్తోంది. నాస్‌డాక్‌తో పాటు ఇతర అమెరికా స్టాక్ ఇండెక్స్‌ల్లోనూ భారీ పతనం నమోదు అయ్యింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆంక్షలు కఠినం చేసే అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటును డెమోక్రాట్లు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఏఐపై పెట్టుబడి పెట్టేందుకు వెనుకడుగు వేశారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా టెకీ కంపెనీల షేర్లు షేక్ అయ్యాయి. ఏఐపై భారీగా పెట్టుబడి పెడితే, దానికి తగిన లాభాలు వస్తాయా రావా అన్న ఆలోచనల్లో మదుపరులు ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాలో మ్యాగ్నిఫిషియంట్ సెవన్ టెకీ కంపెనీల్లో భాగమైన యాపిల్, ఎన్వీడియా, టెస్లా కంపెనీలు ట్రేడింగ్‌లో ట్రిలియన్ డాలర్లు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఎన్విడియా కంపెనీ షేర్లు 9 శాతం పడిపోయాయి. ఇతర చిప్ తయారీ కంపెనీలు కూడా ఇబ్బందిపడ్డాయి. ఏఎండీ, మైక్రాన్ కంపెనీల షేర్లు దాదాపు 17 శాతం కుప్పకూలాయి. బిలియనీర్ ఎలన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్, టెస్లా



కంపెనీల్లో షేర్లు 8, 11 శాతం పడిపోయినట్లు గుర్తించారు. దీంతో ఆ రెండు కంపెనీలకు చెందిన సుమారు 300 బిలియన్ల డాలర్ల మార్కెట్ వాల్యూ పడిపోయింది. రిపబ్లికన్ పార్టీ ప్రచారం కోసం మస్క్ సుమారు 450 మిలియన్ల డాలర్లు ఖర్చు చేశారు. దీంట్లో టెక్సాస్ సేనేట్ అభ్యర్థి కెన్ పాక్స్‌టన్ కోసం 45 మిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టారు. కానీ అక్కడ డెమోక్రటిక్ అభ్యర్థి గెలుపొందారు. యురోప్‌కు చెందిన టెకీ కంపెనీ, చిప్‌మేకర్ ఇన్‌ఫినియాన్ షేర్లు కూడా 8.5 శాతం పడిపోయాయి. ఇక టెకీ ఎక్విప్మెంట్ తయారీ సంస్థ ఏఎస్ఎంఎల్ కంపెనీ షేర్లు 6.5 శాతం తగ్గాయి. శుక్రవారం ఏషియన్ మార్కెట్లు కూడా వణికిపోయాయి. జపాన్‌లో నిక్కీ షేర్ ఇండెక్స్ 6 శాతం పడిపోయింది. మెమోరీ చిప్ తయారీ సంస్థలు కియాక్సియా, టోక్యో ఎలక్ట్రాన్ కంపెనీ షేర్లు భారీగా పతనం అయ్యాయి. దక్షిణ కొరియాలో చిప్‌మేకర్ ఎస్‌కే హైనిక్స్ 10 శాతం, శాంసంగ్ 6.4 శాతం షేర్లు దౌనయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఖర్చులపై భయాందోళనల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు కుదేలు అయినట్లు మార్కెట్‌వాచ్ నిపుణుడు బ్రిట్నీ నుయెన్ తెలిపారు.

మానవాభివృద్ధి లేని ఆర్థిక వృద్ధి!

ఒక దేశం లేదా ప్రాంతం ఆర్థికంగా ఎంత బలపడింది, జీడీపీ వృద్ధి రేటు ఎంత పెరిగింది అనే లెక్కలే నేడు అభివృద్ధికి ప్రామాణికంగా మారుతున్నాయి. అయితే, కేవలం ఆర్థిక సంపద గణాంకాలే ప్రగతికి గీటురాయి కాలేవని ఆర్థిక రంగ నిపుణులు ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తున్నారు. మానవాభివృద్ధిని విస్మరించి కేవలం అంకెలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకునే ఆర్థిక వృద్ధి అస్థిరమైనది మాత్రమే కాదు, పూర్తిగా అనైతికం కూడా. ఆర్థిక వ్యవస్థ ఎంత రిచ్‌గా ఉందన్నది ముఖ్యం కాదు, మనుషులు ఎంత సుఖంగా జీవిస్తున్నారు అనేదే అసలైన అభివృద్ధికి కొలమానం అని నిపుణులు చెబుతున్నారు.

డబ్బు ప్రాముఖ్యత – పరిమితులు

ఆధునిక సమాజంలో మనుగడ సాగించడానికి, ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి డబ్బు అత్యంత కీలకం. కనీస జీవన ప్రమాణాలు, మంచి విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం, నివాసం పొందడానికి ఆర్థిక స్థోమత ఎంతో



అవసరం. అయితే, డబ్బు కేవలం ఒక సాధనం మాత్రమే కానీ అదే గమ్యస్థానం కాకూడదు. ఆర్థిక సంపద కొందరు వ్యక్తులు, కొన్ని వ్యవస్థల వద్ద కేంద్రీకృతమవడం వల్ల సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయని అనేక అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఒకవైపు వేల కోట్లు పోగేసుకునే వర్గం ఉండగా, మరోవైపు కనీస భోజనానికి నోచుకోని కోట్లాది మంది నిరుపేదలు ఉండటం స్థిరత్వం లేని ఆర్థిక విధానాలకు నిదర్శనం. కేవలం పరిశ్రమలు, ఐటీ రంగాలు, స్టాక్ మార్కెట్ సూచీలు పెరిగినంత మాత్రాన ప్రజల జీవితాలు బాగుపడినట్లు కాదు. ఆ సంపద ఫలాలు సమాజంలోని పేద వర్గాలకు, సామాన్యులకు ఏ మేర చేరుతున్నాయనేదే ముఖ్యం. మానవ వనరులపై పెట్టుబడి పెట్టని ఏ ప్రభుత్వ విధానమైనా దీర్ఘకాలంలో విఫలం కావాల్సిందే. ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్య సేన్ వంటి నోబెల్ గ్రహీతలు ఎప్పుడూ 'సామర్థ్యాల అభివృద్ధి' గురించే మాట్లాడారు. ప్రజలకు ఆర్థిక వనరులు ఉండటంతో పాటు వాటిని ఉపయోగించుకునే స్వేచ్ఛ, ఆరోగ్యం, విద్య ఉంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆర్థిక వృద్ధి అనేది మానవుడి శ్రేయస్సును పెంచే సాధనంగా పనిచేయాలి తప్ప, మానవుడిని కేవలం ఆర్థిక వృద్ధికి ఒక వస్తువుగా లేదా సాధనంగా చూడకూడదు. సమాజంలో ఆర్థికాభివృద్ధికి, మానవ వికాసానికి మధ్య సమతుల్యత లోపించినప్పుడు నిరుద్యోగం, పేదరికం, మానసిక ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యలు పెరుగుతాయి. కేవలం భౌతిక సంపద వెంట పరుగులు పెట్టడం మాని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన జీవనం, సమాన అవకాశాలు, గౌరవప్రదమైన బతుకును అందించే సమగ్ర విధానాల వైపు అడుగులు వేయాలి. సంపద సృష్టితో పాటు మానవ విలువలకు పెద్దపీట వేసినప్పుడే దేశంగా ప్రగతి పథంలో పయనిస్తుంది.

కోహ్లీ 100 సెంచరీల కల నెరవేరేనా?
2027 ప్రపంచకప్ లోపు కష్టమంటున్న మాజీ కోచ్!

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీల మైలురాయిని అందుకోవాలని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే 2027 వన్డే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమేనని భారత జట్టు మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ అభిప్రాయ పడ్డాడు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే కోహ్లీకి తగినన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉండాలని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వరకు ఉన్న సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే వంద సెంచరీల మార్కును అందుకోవడానికి సరిపడా మ్యాచ్‌లు లేవని జియోస్టార్‌తో చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి కోహ్లీ 86 సెంచరీలు చేశాడు. భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారాతో కలిసి నాయర్ ఈ అంశంపై చర్చించాడు. "కోహ్లీ వంద సెంచరీలు చేయాలని నేనూ కోరుకుంటున్నా. కానీ ఆ స్థాయికి చేరుకోవాలంటే తగినన్ని మ్యాచ్‌లు ఆడాలి కదా! ప్రపంచకప్ తర్వాత కూడా అతడు ఆడొచ్చు. అయితే అప్పటికి అతడి స్ఫూర్తి ఇదే స్థాయిలో ఉంటుందా అన్నది చెప్పలేం. అందుకే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమని భావిస్తున్నా" అని నాయర్ వివరించాడు. వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో 55 శతకాలు బాదాడు. గతంలో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 49 సెంచరీల రికార్డును



అధిగమించాడు. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై ముంబయిలోని వాంఖడే స్టేడియంలో తన 50వ వన్డే సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. ఇదే చర్చలో భారత జట్టు భవిష్యత్తు కూర్పుపైనా నాయర్ కీలక సూచనలు చేశాడు. హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి పర్యటనల్లో ఇద్దరు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు జట్టులో ఉంటే సమతూకం మెరుగవుతుందని చెప్పాడు. ఇద్దరు ప్రధాన పేసర్లతో పాటు బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం చేకూరుతుందని వివరించాడు. మరోవైపు హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని నితీశ్ కుమార్ రెడ్డిని ప్రత్యామ్నాయ ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దాలని పుజారా సూచించాడు. హార్దిక్ అందుబాటులో ఉంటే అతడే తొలి ఎంపిక అని, అయితే ఏడాది పొడవునా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండలేకపోతున్నందున సమాన సామర్థ్యాలున్న మరో ఆటగాడు అవసరమని పేర్కొన్నాడు. వన్డే క్రికెట్‌పై అభిమానుల్లో ఆసక్తి పెంచేందుకు మళ్లీ ముక్కోణపు, నాలుగు దేశాల టోర్నీలను నిర్వహించాలని నాయర్, పుజారా అభిప్రాయపడ్డారు. మూడు, నాలుగు జట్లు పాల్గొనే టోర్నీల్లో ప్రతి మ్యాచ్ కీలకంగా మారుతుందని, ఆటగాళ్లను ఎక్కువగా చూసే అవకాశం అభిమానులకు లభిస్తుందని పుజారా చెప్పాడు. ఇలాంటి పోటీలు పెద్ద టోర్నీలకు జట్లను సిద్ధం చేయడంతో పాటు వన్డే ఫార్మాట్‌పై ఆసక్తిని పెంచుతాయని నాయర్ పేర్కొన్నాడు. షార్జాలో ఆస్ట్రేలియాపై సచిన్ టెండూల్కర్ ఆడిన చారిత్రక ఇన్నింగ్స్ వంటి జ్ఞాపకాలు ఇలాంటి టోర్నీలతోనే ముడిపడి ఉన్నాయని గుర్తుచేశాడు.

స్పోర్ట్స్

పాపం బాబర్ ఆజమ్..
ఫామ్ కోసం దేశవాళీకి వస్తే
అక్కడా అదే కథ! ఔటై బ్యాట్‌ను బాదేశాడు!

పాపం బాబర్ ఆజమ్.. ఫామ్ అందుకోవాలని దేశవాళీ క్రికెట్‌లోకి అడుగుపెడితే అక్కడా నిరాశే ఎదురైంది. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు కాస్త పరుగులు చేసి ఆత్మవిశ్వాసం పెంచుకుందామనుకున్న పాక్ స్టార్‌కు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ చుక్కెదురైంది. స్వల్ప పరుగులకే పెవిలియన్ బాట పట్టాల్సి వచ్చింది. దీంతో మైదానంలోనే అసహనం బయటపెట్టాడు. ఔటై డ్రెస్సింగ్ రూమ్‌కు వెళుతూ బ్యాట్‌ను నేలకేసి కొట్టాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాకిస్థాన్ దేశవాళీ టోర్నీ ఖైద్-ఎ-ఆజమ్ ట్రోఫీలో లాహోర్ వైట్స్ తరఫున బాబర్ ఆడుతున్నాడు. ఫటా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 28 పరుగులే చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లోనైనా భారీ స్కోరు సాధిస్తాడని అభిమానులు ఆశిస్తే.. 42 పరుగులకే ఔటయ్యాడు. 77 బంతులు ఎదుర్కొన్న బాబర్.. షాహిద్ అజీజ్ వేసిన బంతిని వదిలేయాల్సింది పోయి క్లిక్ చేశాడు. ఆఫ్ స్టంప్‌కు చాలా దూరంగా వెళ్లిన బంతిని శరీరానికి దూరంగా ఆడటంతో బ్యాట్ అంచుకు తగిలి ఫస్ట్ స్లిప్‌లో క్యాచ్‌గా మారింది. అంతే.. మరోసారి పెవిలియన్ దారి పట్టాల్సి వచ్చింది. ఈసారి మాత్రం నిరాశను దాచుకోలేక బ్యాట్‌ను నేలపై బలంగా కొట్టాడు. ఇక మ్యాచ్‌లోనూ లాహోర్‌కు చేదు అనుభవమే ఎదురైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఫటా 362 పరుగులు చేసింది. ఫవాద్ అర్షద్ 115 పరుగులతో రాణించాడు. లాహోర్ తొలి ఇన్నింగ్స్‌లో 234 పరుగులకే ఆలౌటైంది. అలీ జర్యాబ్ 51 పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో మహమ్మద్ ఫరూక్ 123 పరుగులతో చెలరేగడంతో ఫటా 283 పరుగులు సాధించింది. దీంతో లాహోర్ ముందు 412 పరుగుల లక్ష్యం నిలిచింది. కానీ ఆ జట్టు 170 పరుగులకే కుప్పకూలింది. ఫటా 241 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు బాబర్‌కు మరో దేశవాళీ మ్యాచ్ ఆడే అవకాశం కూడా లేదు. ఈ నెల 9 నుంచి రావల్పిండిలో శ్రీలంకతో పాకిస్థాన్ తొలి టెస్టు ఆడనుంది. మరి దేశవాళీ క్రికెట్‌లో పరుగుల కోసం తంటాలు పడుతున్న బాబర్.. అంతర్జాతీయ టెస్టు వేదికపై అయినా తన బ్యాట్‌కు పని చెబుతాడేమో చూడాలి!


ఆర్యావీర్ సెహ్వాగ్, లక్ష్య రాయిచందానీ హాఫ్ సెంచరీలు..
ఆసియా అండర్-19లో భారత్ బోణీ

మస్కట్: అండర్-19 ఆసియాకప్‌లో ఇండియా బోణీ కొట్టింది. ఇవాళ ఒమన్‌లోని మస్కట్‌లో నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ జట్టు 10 వికెట్ తేడాతో విజయం సాధించింది. 129 పరుగుల లక్ష్యాన్ని కేవలం 19.1 ఓవర్లలో అందుకున్నది. ఓపెనర్లు ఆర్యవీర్ సెహ్వాగ్ చెలరేగి ఆడాడు. వీరేంద్ర సెహ్వాగ్ తనయుడైన ఆర్యవీర్.. కేవలం 52 బంతుల్లో 70 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు బౌండరీలు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. ఇక మరో ఓపెనర్ లక్ష్య రాయిచెందాని 63 బంతుల్లో 53 రన్స్ చేసి జట్టుకు విజయాన్ని అందించారు. ఈ విక్టరీతో ఇండియా తన పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. అయితే ఫస్ట్ బ్యాటింగ్ చేసిన నేపాల్ 42.3 ఓవర్లలో కేవలం 138 రన్స్ మాత్రమే స్కోరు చేసి ఆలౌటైంది.నేపాల్ జట్టులో దర్శ్ సోనార్ అత్యధికంగా 43 రన్స్ చేశాడు. భారత బౌలర్లలో అర్జుత్ రాజ్‌పుత్, ఇషాన్ సూద్‌లు చెరి మూడేసి వికెట్లు తీసుకున్నారు.



సాక్షి ఎక్స్‌ప్రెస్

శనివారం 7
నవంబర్ 2026



‘రామాయణ’పై మహేష్ బాబు ప్రశంసలు.. ‘వారణాసి’లో శ్రీరాముడిగా ఎలా కనిపిస్తారోనని చర్చ..!

సూపర్ స్టార్ మహేష్ బాబు తాజాగా ‘రామాయణం’ సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కించిన ఈ భారీ పౌరాణిక చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందనను సొంతం చేసుకుంది. ముఖ్యంగా సినిమాలోని విజువల్స్, నటీనటుల అభినయం, భారీ నిర్మాణ విలువలపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికే దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, అట్లీ వంటి పలువురు ఈ చిత్రాన్ని మెచ్చుకోగా.. తాజాగా మహేష్ బాబు కూడా తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ‘రామాయణ’ పార్ట్-1 సినిమా చూసిన మహేష్ బాబు.. చిత్ర బృందాన్ని అభినందిస్తూ ప్రత్యేకంగా పోస్ట్ చేశారు. చిన్నప్పటి నుంచి వింటూ పెరిగిన పురాణ గాథను ఇంత అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవిల నటన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఇంత భారీ స్థాయిలో సినిమాను నిర్మించడానికి కృషి చేసిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితీష్ తివారీలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ‘రామాయణ’ చిత్ర బృందం మొత్తం అభినందనలకు అర్హులని మహేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మహేష్ బాబు చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు ఆయన తదుపరి చిత్రం ‘వారణాసి’ గురించి కూడా చర్చకు దారితీసింది. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు నటిస్తున్న ఈ భారీ చిత్రం సోషియో ఫాంటసీ, టైమ్ ట్రావెల్, మైథలాజికల్ అంశాల కలయికతో రూపొందుతోంది. ఇందులో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ అత్యంత కీలకంగా ఉండనుంది. ఈ చిత్రంలో మహేష్ బాబు తొలిసారిగా శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణ ఘట్టం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని ప్రచారం జరుగుతోంది. రాముడి పాత్ర కోసం మహేష్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. మహేష్ బాబును శ్రీరాముడి పాత్రలో చూపించేందుకు రాజమౌళి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. లుక్ టెస్ట్ సమయంలో మహేష్‌ను రాముడి గెటప్‌లో చూసి తాను ఆశ్చర్యపోయానని గతంలో రాజమౌళి వెల్లడించారు. దీంతో ‘వారణాసి’లో మహేష్ రాముడి అవతారంలో ఎలా కనిపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది.ఇక ‘రామాయణం’ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, మహేష్ బాబు రాముడి పాత్రలో ఎలా మెప్పిస్తారనే చర్చ మొదలైంది. ఇద్దరు స్టార్ హీరోలు ఒకే పౌరాణిక పాత్రలో కనిపించనుండటంతో అభిమానులు ఈ రెండు చిత్రాలపై ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారు.

విజయ్ సేతుపతికి అరుదైన గౌరవం.. తొలి భారతీయ నటుడిగా ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేదికపై చరిత్ర!




తమిళ చిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విజయ్ సేతుపతి మరో అరుదైన ఘనతను సొంతం చేసుకోబోతున్నారు. హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రల్లో ప్రేక్షకులను మెప్పిస్తున్న ఆయన ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినీ ప్రతిభకు ప్రతినిధిగా నిలవబోతున్నారు. ప్రతిష్ఠాత్మక 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుకలో అవార్డు ప్రెజెంటర్‌గా వ్యవహరించే అవకాశం విజయ్ సేతుపతికి దక్కింది. ఈ ఘనత సాధించనున్న తొలి భారతీయ నటుడిగా ఆయన చరిత్ర సృష్టించబోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా టెలివిజన్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులు, సాంకేతిక నిపుణులను గుర్తిస్తూ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డులను అందిస్తారు. ఈ ఏడాది 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుక నవంబర్ 23, 2026న న్యూయార్క్‌లో జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖులు పాల్గొనే ఈ వేడుకలో అవార్డులు అందించే ప్రెజెంటర్లలో విజయ్ సేతుపతి కూడా ఉండనున్నారు. భారతీయ నటుడికి ఇలాంటి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు దక్కడం సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. గతంలో బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా 2016లో జరిగిన 68వ ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డుల వేడుకలో హాలీవుడ్ నటుడు టామ్ హిడిల్‌స్టన్‌తో కలిసి అవార్డును అందించారు. అయితే ప్రైమ్‌టైమ్ ఎమ్మీ, ఇంటర్నేషనల్ ఎమ్మీ రెండూ వేర్వేరు అవార్డుల వేడుకలు. ఇప్పుడు విజయ్ సేతుపతికి ఇంటర్నేషనల్ ఎమ్మీ వేదికపై ప్రెజెంటర్‌గా అవకాశం రావడం ప్రత్యేకతను సంతరించుకుంది.

సూర్య ‘సీన్’ ఓటీటీ రిలీజ్ టైం ఫిక్స్ నెట్‌ఫ్లిక్స్‌లో ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ కానుందంటే!



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య మరోసారి పోలీస్ ఆఫీసర్ పాత్రలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ ‘సీన్’ దీపావళి కానుకగా నవంబర్ 6న థియేటర్లలో విడుదలైంది. ‘ఆవేశం’ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు జిత్తు మాధవన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చాలా కాలం తర్వాత సూర్య పోలీస్ అధికారిగా కనిపిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. థియేటర్లలో విడుదలైన ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. దీంతో ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీపై అభిమానులు ఆరా తీస్తున్నారు. ‘సీన్’ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. సాధారణంగా థియేటర్లలో విడుదలైన సినిమాలు నాలుగు నుంచి ఆరు వారాల తర్వాత ఓటీటీలోకి వస్తున్నాయి. ఇదే విధానాన్ని అనుసరిస్తే ‘సీన్’ సినిమా డిసెంబర్‌లో డిజిటల్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా డిసెంబర్ మొదటి వారం లేదా మూడో వారంలో స్ట్రీమింగ్ కావచ్చని అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఓటీటీ విడుదల తేదీపై నెట్‌ఫ్లిక్స్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. థియేటర్లలో సినిమా ప్రదర్శన, ప్రేక్షకుల స్పందనను బట్టి విడుదల తేదీలో మార్పులు ఉండవచ్చు. ఈ సినిమాలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ నటించారు. వీరిద్దరి కలయిక సినిమాపై ప్రత్యేక ఆసక్తిని పెంచింది. అంతేకాకుండా నస్లేన్, లాల్, ఆనందరాజ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సుశిన్ శ్యామ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, జగరమ్ స్టూడియోస్ బ్యానర్లపై సూర్య, జ్యోతిక సంయుక్తంగా నిర్మించారు. యాక్షన్‌తో పాటు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అంశాలను మేళవించి దర్శకుడు ఈ సినిమాను రూపొందించారు. సీన్ సినిమా కథ విషయానికి వస్తే.. ఈ సినిమాలో సూర్య ఇన్బరాజ్ అనే పోలీస్ అధికారిగా కనిపించారు. పోలీస్ శాఖలో మంచి పేరు, గుర్తింపు సంపాదించుకున్న ఇన్బరాజ్ కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల తన ఉద్యోగానికి రాజీనామా చేస్తాడు. అయితే గతంలో ఆయన పరిష్కరించకుండా వదిలేసిన ఒక కేసు మరోసారి తెరపైకి వస్తుంది. దీంతో ఆ కేసును ఎలాగైనా పరిష్కరించాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఎదురవుతుంది.ఈ నేపథ్యంలో ఇన్బరాజ్ మరోసారి కేసు దర్యాప్తులోకి దిగాల్సి వస్తుంది. అయితే ఈసారి ఆయనకు ఎదురయ్యే పరిస్థితులు అంత సులభంగా ఉండవు. సమస్యాత్మకమైన, గందరగోళమైన ఓ పోలీస్ బృందంతో కలిసి దర్యాప్తు కొనసాగించాల్సి వస్తుంది. గతంలో పరిష్కారం కాని ఆ కేసు వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటి? పాత కేసుకు, ఇప్పుడు ఎదురైన పరిణామాలకు ఉన్న సంబంధం ఏంటి? మంచి పేరున్న సిన్సియర్ పోలీస్ అధికారి ఇన్బరాజ్ ఉద్యోగానికి ఎందుకు రాజీనామా చేశాడు? చివరకు ఈ కేసును ఎలా పరిష్కరించాడు? అనేది సినిమాలో ఆసక్తికరంగా ఉండనుంది.

బాలయ్య ‘దాదా’లో క్రేజీ ఐటెం సాంగ్.. థమన్ ఈసారి కూడా మాస్ బీట్‌తో దుమ్ములేపనున్నాడా?



నందమూరి నటసింహం బాలకృష్ణ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ‘దాదా’ ఒకటి. గతంలో బాలయ్యతో ‘వీరసింహారెడ్డి’ వంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్ణయించిన సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్ర బృందం కష్టపడుతోంది. మరోవైపు ఈ సినిమాకు సంగీతం అందిస్తున్న ఎస్.ఎస్. థమన్ విషయంలోనూ అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమాలో ఓ అదిరిపోయే ఐటెం సాంగ్ ఉండబోతుందనే ప్రచారం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. బాలకృష్ణ, థమన్ కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన పాటలు, నేపథ్య సంగీతం అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బాలయ్య మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా థమన్ అందించే బాణీలు థియేటర్లలో అభిమానులతో విజిల్స్ వేయిస్తుంటాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాల్లో పాటలు మంచి ఆదరణ పొందడంతో ‘దాదా’పై కూడా సంగీతం విషయంలో అంచనాలు పెరిగాయి. ఇప్పటికే బాలకృష్ణ సినిమాల్లో ఐటెం సాంగ్స్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా థమన్ అందించే బీట్స్ ఈ పాటలకు మరింత ఊపునిస్తుంటాయి. ఇప్పుడు ‘దాదా’ సినిమాలో కూడా ఓ ప్రత్యేకమైన ఐటెం సాంగ్ ఉండబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ పాట కోసం థమన్ అదిరిపోయే మాస్ బీట్స్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రత్యేక పాటలో బాలయ్యతో కలిసి స్టెప్పులు వేసే బ్యూటీ ఎవరనే విషయం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతంలో బాలయ్య సినిమాల్లో ప్రత్యేక పాటలు చేసిన హీరోయిన్ల తరహాలో ఈసారి కూడా ఓ క్రేజీ హీరోయిన్‌ను తీసుకురాబోతున్నారా? అనే చర్చ జరుగుతోంది. అయితే ఈ పాటలో నటించబోయే హీరోయిన్ ఎవరు? పాట చిత్రీకరణ ఎప్పుడు జరగనుంది? అనే విషయాలపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు అంచనాలు ఉన్నాయి.

కళ్లకు కూలింగ్ గ్లాసెస్.. బ్లాక్ అవుట్‌ఫిట్‌లో కీర్తి సురేశ్ అదిరిపోయే లుక్

